
సాక్షి బాపట్ల

ఆదివారం । 14 । మే । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 521.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి విడుదలవుతున్న నీటిని నిలిపివేశారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1,500, గరిష్ట ధర రూ.3,000, మోడల్ ధర రూ.2,000 వరకు పలికింది.



ప్రతిధ్వనించిన వేదనాదం

విజయవాడ కల్చరల్: విజయవాడ ఇందిరా గాంధీ స్టేడియంలో నిర్వహిస్తున్న అష్టోత్తర శత (108) కుండాత్మక చండీ, రుద్ర, రాజ శ్యామల సుదర్శన సహిత శ్రీ లక్ష్మీ యజ్ఞం శనివారం వైభవంగా కొనసాగింది.

న్యూస్‌రీల్

నేడు దేశీయ ఆవుల అభివృద్ధి కేంద్రం ప్రారంభం



అమరావతి: మండల పరిధిలోని అత్తలూరు–పాలెం సేంద్రియ వ్యవసాయ రైతు సమాఖ్య వారిచే నిర్మించబడిన దేశీయ ఆవుల అభివృద్ధి కేంద్రంను ఆదివారం ప్రారంభిస్తున్నట్లు అత్తలూరు–పాలెం సేంద్రియ వ్యవసాయ రైతు సమాఖ్య చైర్మన్ నూతలపాటి సురేంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డు మాజీ చైర్మన్ డాక్టర్ చింతల గోవిందరాజులు, తెలంగాణ నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ సుశీల, ఇతర అధికారులు పాల్గొంటారని తెలిపారు.

రేడియల్ గేట్ ఆమ్స్ బిగింపు



అచ్చంపేట: వరదలకు కొట్టుకుపోయిన పులిచింతల 16వ నెంబరు గేటు పునర్నిర్మాణంలో భాగంగా రేడియల్ గేట్‌ను అమర్చేందుకు హెవీలోడెడ్ క్రేన్స్ సహాయంతో కాంక్రీట్స్‌పై రెండువైపులా ఆమ్స్‌ని కూర్చోబెట్టే పనిని ఇంజినీర్లు విజయవంతంగా శనివారం పూర్తి చేశారు. ఇంకా 300 టన్నుల బరువు కలిగిన రేడియల్ గేటును ఆమ్స్‌పై ఎక్కించి, ప్రాజెక్టుకు బిగించాల్సి ఉంది. రేడియల్ గేటు బిగించగానే గతంలో 16నెంబరు కానాను మూసేసేందుకు వినియోగించిన స్టాప్‌లాగ్ ఎలిమెంట్స్‌ను తీసేస్తారు. అప్పుడే గేటును పైకెత్తేందుకు, కిందకు దించేందుకు అవకాశం ఉంటుందని ఇంజినీర్లు చెబుతున్నారు.

నేడు కేఎల్‌యూకు హైకోర్టు సీజే రాక

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే కార్యక్రమానికి ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్‌మిశ్రా ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని వర్సిటీ న్యాయ కళాశాల విభాగాధిపతి విజయసుధ శనివారం తెలియజేశారు. ఆమె మాట్లాడుతూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సహకారంతో ఈనెల 14 నుంచి 16వరకు మూడు రోజుల ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, 14వ తేదీ ఆదివారం నాటి కార్యక్రమాన్ని ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా ప్రారంభిస్తారని వివరించారు.

ఆర్‌బీకేలకు వైఎస్సార్ రైతు భరోసా జాబితాలు

కొరిటెపాడు(గుంటూరు): వరుసగా ఐదో ఏడాదికి వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం విడుదలకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల వారీగా అర్హుల జాబితా సోషల్ ఆడిట్‌కు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే అర్హులు, అనర్హుల జాబితాలు ఆర్‌బీకేలకు చేరాయి. వీటిని ఆర్‌బీకే ఇన్‌చార్జ్‌లు డౌన్‌లోడ్ చేసి రైతుల పరిశీలనకు పెట్టి అభ్యంతరాలు తీసుకోవడం, వాటిని పరిశీలించి అప్‌లోడ్ చేసేందుకు ప్రభుత్వం షెడ్యూలు విడుదల చేసింది. ఈ నెల 12వ తేదీ నుంచి జాబితాలను ఆర్‌బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. 15 నుంచి 18వ తేదీ వరకు కొత్త రైతుల రిజిస్ట్రేషన్ వివరాలు, అభ్యంతరాలను వీఏఏలు వైఎస్సార్ రైతుభరోసా పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేస్తారు. ఈ నెల 15 నుంచి 20వ తేదీ వరకు వీటిని మండల ఏఓలు పోర్టల్‌లో ఆమోదించడం లేదా తిరస్కరించడం జరుగుతుంది. ఈ నెల 25 నుంచి 31వ తేదీ లోపు ఏ రోజైన వైఎస్సార్ రైతుభరోసాతో పాటు, 2022 ఖరీఫ్ పంటల బీమా పరిహారం, అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారు.



సూర్యలంక తీరంలో నూతనంగా నిర్మించిన తారకేశ్వరస్వామి దేవాలయంలో ప్రతిష్టా మహోత్సవం శనివారం వైభవంగా జరిగింది. బ్రహ్మశ్రీ గోలి వెంకట సుబ్రహ్మణ్యశర్మ అవధాని పర్యవేక్షణలో శ్రీ విజయరాజు గణపతి, అన్నపూర్ణా సమేత శ్రీ తారకేశ్వరస్వామి వార్లు, నంది, ధ్వజ, శిఖర ప్రతిష్టలను తుని తపోవనం మఠాధిపతులు సచ్చిదానంద సరస్వతి మహాస్వామి చేతుల మీదుగా చేసి కుంభాభిషేకాలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్, చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు విచ్చేసి స్వామివార్లకు పూజలు నిర్వహించారు.

– బాపట్ల అర్బన్



స్పందన తాత్కాలికంగా రద్దు

బాపట్ల టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 16న జిల్లాలో పర్యటిస్తున్నందున 15వ తేదీ సోమవారం స్పందన కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్‌లు శనివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నారు.

మత్స్యకార భరోసా విజయవంతం చేద్దాం



రేపల్లె రూరల్: ఈ నెల 16వ తేదీ నిజాంపట్నంలో నిర్వహించే మత్స్యకార భరోసా కార్యక్రమం విజయవంతమయ్యేలా ప్రతి ఒక్కరూ శక్తి వంచన లేకుండా పనిచేయాలని డీఆర్‌డీఏ పీడీ అర్జున్‌రావు కోరారు. పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో శనివారం మత్స్యశాఖ, ఐకేపీ, అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాల్గవ విడత మత్స్యకార భరోసా నిధులను పంపిణీ చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిజాంపట్నం విచ్చేస్తున్నారన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మత్స్యశాఖ పీడీ సురేష్ మాట్లాడుతూ వేట నిషేధకాలంలో మత్స్యకార కుటుంబీకులు ఇబ్బందులుపడకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ మత్స్యకార భరోసా కార్యక్రమం ద్వారా రూ.10వేలు అందిస్తున్నారన్నారు. పట్టణ, మండలంలోని అర్హులైన మత్స్యకారులు కార్యక్రమానికి తప్పక హాజరుకావాలని కోరారు. జడ్పీటీసీ బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, హౌసింగ్ శాఖ పీడీ ప్రసాద్, మత్స్యశాఖ ఏడీ గాలి దేవుడు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల ప్రమాదాలకు చెక్

- పర్యాటకులు రద్దీగా ఉండే ప్రాంతాల్లో అవుట్ పోస్టుల ఏర్పాటు
- 24 గంటలు అందుబాటులో పోలీసు సేవలు
- చీరాల, సూర్యలంక ప్రాంతాల్లో ఏర్పాటు



వాడరేవు తీరంలో సేద తీరుతున్న పర్యాటకులు

చీరాల: ఆహ్లాదం కోసం వచ్చిన పర్యాటకులు అవగాహన లేక కెరటాల తాకిడికి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. ముఖ్యంగా జిల్లాలోని వేటపాలెం మండలం రామాపురం, వేటపాలెం ప్రాంతాల్లో ప్రతి వారం మరణాలు సంభవిస్తుంటాయి. తెలియని వారు లోతుకు వెళ్లడం, సుడిగుండాల్లో చిక్కుకొని సముద్రంలో కలిసిపోతున్నారు. ప్రధానంగా కేవలం 30 ఏళ్ల యువకులే ప్రాణాలు పోగొట్టుకుంటున్న వారు అధికంగా ఉన్నారు. వీటిని అరికట్టేందుకు ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తోంది. ఇప్పటికే మెరైన్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసి నిత్యం పర్యాటకులను హెచ్చరిస్తూ గస్తీ కాస్తున్నారు. ఇందులో భాగంగా టూరిస్ట్ పోస్ట్‌లతో పర్యాటకులకు ప్రమాదాలు జరగకుండా చెక్ పెట్టేందుకు పోలీస్ పోస్ట్‌ను ఏర్పాటు చేశారు.

జిల్లాలో సూర్యలంక, చీరాలలో ఏర్పాటు..

జిల్లాలో తీర ప్రాంత పరిధిలో పర్యాటకుల భద్రత కోసం ఏర్పాటు చేసిన పోలీస్ పోస్ట్‌లను బాపట్లలోని సూర్యలంక, చీరాల నియోజకవర్గంలో రామాపురం, కఠారివారిపాలెం, వాడరేవు ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. బాపట్ల జిల్లాలో ఉన్న ఏడు తీరప్రాంత మండలాల్లో 76 కిలో మీటర్లు ఉంది. జిల్లాలోని రేపల్లె, నిజాంపట్నం, బాపట్ల, చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల్లో సముద్ర తీరప్రాంతం ఉంది. సముద్రతీర ప్రాంతం జిల్లాలోని రేపల్లెలోని లంకెవారిపల్లిదిబ్బ నుంచి చినగంజాం మండలం ఏటిమొగ వరకు తీరప్రాంతం విస్తరించి ఉంది. సముద్రతీర ప్రాంతంలో ఏర్పాటు చేసే అవుట్ పోస్టుల్లో పనిచేసే సిబ్బందికి ప్రత్యేకంగా జాకెట్లు, సామగ్రి, మైకు, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు ఇవ్వడంతో పాటు ప్రత్యేకంగా 108 అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచుతారు. పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా టూరిస్ట్ పోలీస్ అవుట్ పోస్టులను ఏర్పాటు చేశారు.



రామాపురంలో పోలీస్ అవుట్‌పోస్టును పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

24 గంటలు అందుబాటులో సిబ్బంది..

టూరిస్ట్ పోలీసు అవుట్‌పోస్ట్‌లు 24 గంటలు పనిచేస్తాయి. మూడు షిఫ్టుల్లో పోలీస్ సిబ్బంది పనిచేస్తారు. సముద్రంలోకి వెళ్లేటప్పుడు లోతు ప్రాంతంలోకి వెళ్లవద్దని హెచ్చరిస్తారు. పొరపాటున వెళితే అందుబాటులో ఉన్న వీరు వారిని వెంటనే రక్షిస్తారు. బీచ్‌లో అనుమానాస్పదంగా వ్యక్తులు తిరిగితే వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తారు. ఇప్పటికే జిల్లాలో ఏర్పాటు చేసిన పోలీస్ అవుట్‌పోస్ట్‌లను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పరిశీలించారు. ఇటీవల గుంటూరు జిల్లా క్రోసూరు మండలం నాగవరానికి చెందిన 50 మంది బృందం వాడరేవు స్నానానికి వచ్చారు. వీరిలో సయ్యద్ రాజావలి సముద్రంలో అలల తాకిడికి గురై కొట్టుకుపోతుండగా కానిస్టేబుల్ నరేష్‌బాబు, హోంగార్డు శ్రీనివాసరావులు గమనించి రాజావలిని తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కాపాడి ఒడ్డుకు చేర్చారు. యువకుడి ప్రాణాలను కాపాడిన మెరైన్ పోలీసులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

పర్యాటక ప్రాంతంగా చీరాల..

బాపట్ల జిల్లాలో చీరాలలోని తీరప్రాంతాలైన వాడరేవు, రామాపురం ప్రాంతాలకు రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. సెలవు దినాలలో ఇతర ప్రాంతాల నుంచే కాక స్థానికులు సముద్ర తీరానికి వస్తుంటారు. అలానే తీరం సమీపంలో రిసార్ట్స్ కూడా ఉండడంతో చీరాలలోని తీరప్రాంతానికి రావడానికి పర్యాటకులు మొగ్గు చూపుతున్నారు. అలానే సినిమా షూటింగ్‌లు ఎక్కువగా జరుగుతుంటాయి. సెలవు దినాలలో పిల్లలతో కలిసి సేద తీరేందుకు పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. వీరి భద్రత కోసం త్వరలో పోలీస్ అవుట్‌పోస్టులు అందుబాటులోకి రానున్నాయి.

అమ్మకు అభివందనం

ఆధునిక వైద్యంతో 'మాతృత్వం' సులభతరం

- ప్రభుత్వ చర్యలతో తగ్గిన మాతృ మరణాలు
- నేడు మదర్స్ డే



గుంటూరు మెడికల్: ఆధునిక జీవన శైలికి అలవాటు పడడంతో పలు జంటలు సకాలంలో సంతానం కలుగక అనేక ఇబ్బందులు పడుతున్నాయి. ప్రతి ఏడాది సంతానం కోసం ఎదురు చూసేవారి సంఖ్య పెరిగిపోతూనే ఉంది. అమ్మ అనే పిలుపు కోసం మహిళలు ఎంతగానో ఎదురు చూస్తుంటారు. అలాంటి వారికి నేడు ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి ఏడాది మే నెల రెండవ ఆదివారంను మదర్స్ డేగా నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ప్రత్యేక కథనం

జిల్లాలో బాధితులు..

గుంటూరు జిల్లాలో 190 మంది గైనకాలజిస్టులు ఉన్నారు. గుంటూరు నగరంలోనే 90 మంది గైనకాలజిస్టులు వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతినెలా ఒక్కో వైద్యుడి వద్దకు సుమారు 30 నుంచి 40 మంది సంతాన లేమితో చికిత్స కోసం వస్తున్నట్లు గైనకాలజీ అసోసియేషన్ సెక్రటరీ డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌లో సంతాన లేమితో బాధపడుతున్నవారికి ఉచితంగా ప్రత్యేక వైద్యసేవలందిస్తున్నారు. గుంటూరు నగరంలో సంతానలేమి సమస్యతో బాధపడుతున్నవారికి ప్రత్యేకంగా వైద్య సేవలు అందించే ఆసుపత్రులు పది ఉన్నాయి.

గణనీయంగా తగ్గిన మాతృ మరణాలు...

గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సరైన వైద్య సౌకర్యాలు ముఖ్యంగా గర్భిణులకు సరైన సదుపాయాలు అందుబాటులో లేకపోవడంతో అనేకమంది మాతృమూర్తులు కాన్పు సమయంలో కన్నుమూసేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఆరోగ్య కేంద్రాల్లో నాడు –నేడు పనుల్లో భాగంగా అనేక మార్పులు తీసుకొచ్చి వైద్య సౌకర్యాలు కల్పించింది. ముఖ్యంగా గర్భిణులు సుఖ ప్రసవమయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా గైనకాలజిస్టులను నియమించి ప్రతి వారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పట్టణ ఆరోగ్య కేంద్రంలోనే గైనకాలజిస్టుల సేవలను గర్భిణులు వినియోగించుకునేలా చేసింది. అంతేకాకుండా అల్ట్రా సౌండ్ వైద్య పరికరాలను సైతం ప్రభుత్వం ఆరోగ్య కేంద్రాలకు అందజేయడంతో స్కానింగ్‌కు గర్భిణులు ఎక్కడకు వెళ్లే పనిలేకుండా చికిత్స పొందుతున్న వైద్యుల వద్దే గర్భంలో ఉన్న శిశువు ఆరోగ్యపరిస్థితి తెలుసుకునే అవకాశం కల్పించింది. పలు రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు, మందులు అన్ని కూడా ఉచితంగా ఆరోగ్యకేంద్రాల్లో ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. హైరిస్క్ ప్రెగ్నెన్సీ ట్రాకింగ్, బర్త్ ప్లాన్, ఎర్లీమ్యాపింగ్ చర్యలతో మాతృమరణాల సంఖ్య చాలా తగ్గుముఖం పట్టింది.

జిల్లాలో మాతృ మరణాలు	
2014-15లో	66 మంది
2015 -16	62 మంది
2016-17	57 మంది
2017 -18	87 మంది
2018-19	60 మంది
2019-20	14 మంది
2020-21	19 మంది
2021-22	18 మంది
2022-23	11 మంది


ఆరోగ్య కేంద్రాల్లోనే గైనకాలజీ సేవలు



రాష్ట్రప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రతి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం బలోపేతానికి చర్యలు తీసుకుంది. తద్వారా మాతృమరణాలు జిల్లాలో చాలా తగ్గుముఖం పట్టాయి. ముఖ్యంగా గైనకాలజిస్టులను ప్రభుత్వం నియమించి స్కానింగ్ మిషన్లు, రేడియాలజిస్టులను కూడా నియమించడంతో ఆరోగ్య కేంద్రాల్లోనే గర్భిణులకు అన్నిరకాల వైద్య సేవలు సత్వరమే లభిస్తున్నాయి.

– డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డీఎంహెచ్‌ఓ

అత్యాధునిక వైద్య పద్ధతులు...



సంతానం కోసం చింతించే వారికి నేడు అత్యాధునిక వైద్య పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్(ఐవీఎఫ్) విధానంలో భార్య అండాన్ని, భర్త శుక్రకణాల్ని ఇంక్యుబేటర్‌లో పెట్టి మూడు నుంచి ఐదు రోజుల్లో పిండం తయారయ్యాక ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలోకి ఎక్కిస్తారు. భర్త శుక్రకణాల సంఖ్య తక్కువగా ఉంటే ఇక్సీ విధా నం ద్వారా, సంఖ్య జీరో అయితే టీసా పద్ధతి ద్వారా వీర్యకణాలు తీసి ఫలదీకరణం చెందించి పిండాన్ని తయారు చేసి గర్భంలో ప్రవేశపెడతారు. ఐయూఐ విధానంలో భర్త శుక్రకణాలు తీసి ఇంజెక్షన్ రూపంలో భార్య గర్భంలో ప్రవేశపెడతారు.

– డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్, ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణుడు, గుంటూరు

'భరోసా' సభ పనులు వేగవంతం



సభాస్థలి వద్ద ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎంపీ మోపిదేవి, కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ వకుల్ జిందాల్

- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు
- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌తో కలిసి ఏర్పాట్లు పరిశీలన

నిజాంపట్నం: ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను శరవేగంగా చేపట్టడం జరుగుతుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు తెలిపారు. సీఎం పర్యటన ఏర్పాట్లను శనివారం ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌లతో కలిసి పరిశీలించారు. హెలిప్యాడ్ నిర్మిస్తున్న ప్రాంతాన్ని, అక్కడ జరుగుతున్న భద్రతా ఏర్పాట్లను పరిశీలించి, మిగిలిన ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. సీఎం కాన్వాయ్‌కు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. హెలిప్యాడ్ చుట్టూ బారికేడ్ల ఏర్పాటు, సభావేదిక ఏర్పాటు, సభాప్రాంగణం లోపలికి ప్రజలు వచ్చి, పోయే మార్గాలు, వీవీఐపీ, వీఐపీ మార్గాలు, సభకు వచ్చే ప్రజల వాహనాల పార్కింగ్, వీవీఐపీ, వీఐపీ వాహనాల పార్కింగ్ స్థలాల వద్ద బందోబస్తు, భద్రతా ఏర్పాట్లను అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. సీఎం కాన్వాయ్ వచ్చే మార్గం, సభాప్రాంగణంలో ప్రతి ప్రాంతం పూర్తిస్థాయిలో కవర్ అయ్యేవిధంగా సీసీ కెమెరాలు అమర్చాలని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అధికారులను ఆదేశించారు. పూర్తిస్థాయి బారికేడింగ్ ఉండేలా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. రూఫ్ టాప్‌పై ప్రత్యేక దృష్టిపెట్టి భద్రత పెంచాలన్నారు. అదేవిధంగా ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి.మహేష్, రేపల్లె డీఎస్పీ టి.మురళీకృష్ణ, పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో 465 కేసులు పరిష్కారం

రేపల్లె: లోక్ అదాలత్‌లో 465 కేసులు పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక కోర్టు హాలులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. లోక్‌అదాలత్‌తో కక్షిదారులు రాజీపడదగ్గ కేసులను త్వరితగతిన పరిష్కరించుకోవచ్చన్నారు. దీంతో కాలం, ధనం రెండూ ఆదా అవుతాయన్నారు. 20 సివిల్ కేసులు, 443 క్రిమినల్ కేసులు, 2 ప్రీలిటిగేషన్ కేసులు మొత్తం 465 కేసులు పరిష్కరించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జగదీష్‌కుమార్, న్యాయవాదులు శ్రీనివాసరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్



వేమూరు సీఐ వెంకటేశ్వరరావు

కొల్లూరు: మహిళపై లైంగిక దాడికి పాల్పడిన ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసినట్లు వేమూరు సీఐ వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. వివరాలు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తెనాలి నుంచి ఆటోలో వస్తుండగా మండల పరిధిలోని మొసలిపాడు వద్ద తెనాలికి చెందిన ఆటో డ్రైవర్ మొగిలి గోపికృష్ణ(వాసు) ఆటోని మొక్కజొన్న పొలాల్లోకి తీసుకువెళ్లి మహిళపై దాడి చేసి గాయపరిచి గురువారం రాత్రి లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపిన అనంతరం నిందితుడ్ని అరెస్టు చేసినట్లు చెప్పారు. నిందితుడు గోపికృష్ణ (26)కు గతంలో ఓ వివాహం జరిగి ముగ్గురు సంతానం ఉన్నారని, మొదటి భార్య చర్యల కారణంగా విసిగిపోయి విడిచి వెళ్లిపోవడంతో రెండో వివాహం చేసుకోగా మరో ఇద్దరు పిల్లలు ఉన్నారు. నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి తెనాలి కోర్టుకు హాజరు పరచనున్నట్లు తెలిపారు.

దిశ యాప్‌తో ఆపదల నుంచి బయటపడాలి

మహిళలు, యువతులు తప్పనిసరిగా దిశ యాప్‌ను తమ మొబైల్ ఫోన్‌లో అందుబాటులో ఉంచుకుని ఆకస్మాత్తుగా ఎదురయ్యే ఆపదల నుంచి బయటపడాలని సీఐ సూచించారు. ఆటోలు, ఇతర వాహనాలలో ప్రయాణించే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని చెప్పారు. భద్రతకు ముప్పు పొంచి ఉన్న సమయాలలో దిశ యాప్‌ను ఉపయోగించిన పక్షంలో సమీపంలోని పోలీసు స్టేషన్ నుంచి వెంటనే పోలీసులు లొకేషన్ ఆధారంగా అతి కొద్ది సమయంలో అక్కడకు చేరుకుని కాపాడేందుకు అవకాశం ఉంటుందని వివరించారు.

హెచ్ఆర్‌పీసీఐ ఉమెన్ అండ్ చైల్డ్ చైర్‌పర్సన్‌గా ప్రసన్న రాధిక

గుంటూరు రూరల్: హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (హెచ్ఆర్‌పీసీఐ) ఉమెన్ అండ్ చైల్డ్ నేషనల్ చైర్‌పర్సన్‌గా గుంటూరు రూరల్ మండలం పలకలూరుకి చెందిన వాసిరెడ్డి ప్రసన్న రాధిక నియమితులయ్యారు. నేషనల్ చైర్మన్ తాళ్లూరి ప్రసన్నకుమార్ ఈ నెల 9న నియామక పత్రాల్ని అందించినట్లు ఆమె చెప్పారు. పలకలూరు రోడ్డులోని ఒక ప్రైవేటు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సమాజంలో మహిళలు, చిన్నారులకు రక్షణ కరువైందన్నారు.

కోలాహలంగా ఎడ్ల బండ లాగుడు పోటీలు

బల్లికురవ: రాష్ట్రస్థాయి ఎడ్ల బండ లాగుడు పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. మండలంలోని కొణిదెన గ్రామ సమీపంలోని రామలింగేశ్వర స్వామి వార్షిక తిరునాళ్ల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రెండు పళ్లు, నాలుగు పళ్ల విభాగాల్లో వేర్వేరుగా ఎడ్ల బండ లాగుడు పోటీలు శనివారం నిర్వహించారు. పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి 22 జతలు పాల్గొన్నాయి. రెండు పళ్ల విభాగంలో మొదట బహుమతి కొణిదెల గ్రామానికి చెందిన గుంజి రుషిత, రెండో బహుమతి మార్టూరు మండలం నాగరాజుపల్లి గ్రామానికి చెందిన తోట సుబ్బారావు, మూడో బహుమతి పెదకాకాని మండలం తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన తరుణ్‌తేజ ఎడ్లు, నాలుగో బహుమతి పల్నాడు జిల్లా ఇక్కుర్తి గ్రామానికి చెందిన ఎం.పోతురాజు ఎడ్లు సాధించాయి.

నాలుగు పళ్ల విభాగంలో..

మొదటి బహుమతి కొణిదెనకు చెందిన గుంజి వినయ్ కుమార్, రెండో బహుమతి గుంజి వెంకటేశ్వర్లు, మూడో బహుమతి కాకుమాను మండలం జీపీ చౌదరి, నాలుగో బహుమతి ప్రత్తిపాడు మండలం కల్లూరి రాజేష్ ఎడ్లు సాధించాయి. రెండు పళ్ల విభాగంలో మొదటి బహుమతి రూ.20 వేలు, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో రూ.10 వేలు అందించారు. నాలుగు పళ్ల విభాగంలో మొదటి బహుమతి రూ.30 వేలు, రెండో బహుమతి రూ. 20 వేలు, మూడో బహుమతి రూ.15 వేలు నిర్వాహకులు అందించారు.



పోటీలో బండ లాగుతున్న ఎడ్లు

జొన్న, మొక్కజొన్న కొనుగోలుకు చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి అబ్దుల్ సత్తార్

భట్టిప్రోలు: అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న జొన్న, మొక్కజొన్న పంటలను బాపట్ల జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఎస్‌కే అబ్దుల్ సత్తార్ శనివారం పరిశీలించారు. భట్టిప్రోలు మండలంలోని పల్లెకోన, కోనేటిపురం, పడమటివారిపాలెం గ్రామాలలో ఆయన పర్యటించి దెబ్బతిన్న దిగుబడులను పరిశీలించి రైతులతో మాట్లాడారు.

దెబ్బతిన్న, మొలకెత్తిన, రంగుమారిన జొన్న, మొక్కజొన్న పంట దిగుబడులను గ్రామ వ్యవసాయ సహాయకులు పరిశీలించి రైతుల జాబితాను రూపొందిస్తారని తెలిపారు. వీటిని ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేయించుకుని ఆర్బీకేలలో రిజిస్టార్ చేయించుకోవాలని కోరారు. వారం రోజుల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తారని చెప్పారు. ఆయన వెంట మండల వ్యవసాయ శాఖాధికారి గొల్లపోతు మీరయ్య, పల్లెకోన, రాచూరు సర్పంచులు బొల్లెద్దు రాజమ్మ ప్రతాప్, జయవరపు రాధా కృష్ణమూర్తి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతిబాబు, పల్లెకోన ఏఎంసీ చైర్మన్ మండవ రామకోటేశ్వరరావు, వీఆర్వో నజీరున్నీస్సా, వైఎస్సార్ సీపీ నాయకులు నాగమల్లేశ్వరరావు, బాలాజీ పాల్గొన్నారు.



దెబ్బతిన్న మొక్కజొన్నను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్‌కే అబ్దుల్ సత్తార్

ఖోఖో వేసవి శిక్షణ శిబిరం

జె.పంగులూరు: ఖోఖో వేసవి శిక్షణ శిబిరం కొనసాగుతోంది. పంగులూరు మాగుంట సుబ్బరామిరెడ్డి, బాచిన నారాయణమ్మ జూనియర్ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ సహకారంతో ఖోఖో వేసవి శిక్షణ శిబిరాన్ని ఈనెల 7వ తేదీ ప్రారంభించారు. బాపట్ల, ఉమ్మడి ప్రకాశం జిల్లా నలుమూలల నుంచి బాలికలు 30 మంది, బాలురు 40 మంది, పురుషులు 30 మంది మొత్తం వంద మందికి శిక్షణ ఇస్తున్నారు. జూన్ 1వ తేదీ వరకు శిక్షణ ఉంటుందని పీడీ మేకల సీతారామిరెడ్డి తెలిపారు. బాపట్ల జిల్లా చీఫ్ కోచ్ కేపీ పాల్‌కుమార్, ప్రకాశం జిల్లా చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి శిక్షణను పర్యవేక్షిస్తున్నారు.

చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల పొత్తు ఊహించిందే

వైఎస్సార్ సీపీ నాయకుడు రామనాథంబాబు

మార్టూరు: ప్రతిపక్షనేత చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్‌ల అనైతిక పొత్తు మొదటి నుంచి ఊహించినదేనని వైఎస్సార్ సీపీ నాయకుడు రావి రామనాథంబాబు అన్నారు. మార్టూరు ఉప సర్పంచి కాకోలు రామారావు నివాసంలో శనివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. వీరిద్దరి పొత్తు ఇప్పుడు కొత్తగా ప్రారంభమైనది కాదని 2019లోనే ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా తీరు మార్చుకోలేదని విమర్శించారు. ఎంత సేపటికి నన్ను గెలిపించండి, నాకు 30 సీట్లు ఇప్పించండి అంటూ పార్టీ కార్యకర్తలను అభ్యర్థించే పవన్ కల్యాణ్ ఏనాడు తమ పార్టీ కార్యకర్తల కోసం నిర్మాణాత్మకంగా పనిచేసింది లేదని ఎద్దేవా చేశారు. ఆయన సేవలు మొత్తం చంద్రబాబును ముఖ్యమంత్రి చేయటం కోసమే అని ఆరోపించారు. పార్టీలకు, కుల, మతాలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శకంగా ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలే ఆయనను తిరిగి ప్రజలు రెండోసారి సీఎంగా గెలిపించి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. రానున్న సాధారణ ఎన్నికలలో ప్రజలు భారీ మెజార్టీతో సీఎం వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, ఉప సర్పంచ్ కాకోలు రామారావు, ఎస్సీసెల్ కన్వీనర్ అట్లూరి సుకుందరావు, చినగంజాం మండల మాజీ కన్వీనర్ కోట విజయభాస్కర్‌రెడ్డి, సులేమాన్, గొట్టిపాటి ఆనంద్, కరిముల్లా, రఫీ, కాళహస్తి కృష్ణమూర్తి పాల్గొన్నారు.